ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న శిల్పాలు

మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శిల్పాలను తిలకిస్తున్న సందర్శకులు

కొండాపూర్, మే 15: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం ఏర్పాటు చేసిన స్పెక్టమ్ చిత్ర, శిల్పాల (స్కల్ప్చర్స్) ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. ప్రదర్శనలోని చిత్రాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయన్నారు. శిల్పకారులు రూపొందించిన స్కల్ప్చర్లు వాటి జీవన స్థితిగతులను చక్కగా వివరించేలా ఉన్నాయన్నారు. ఏడు గురు కళాకారులు తయారు చేసిన 15 శిల్పాలు, 30 పెయింటింగ్స్ ప్రదర్శనలో ఉంచినట్లు, ఈ ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బీబీ ఆంకాలజీతో రెనోవా ఒప్పందం

ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రెనోవా హాస్పిటల్స్ చైర్మన్, ఎండీ డాక్టర్ పి.శ్రీధర్, బీబీ ఆంకాలజీ సెంటర్ చైర్మన్, ఎండీ డాక్టర్ సయ్యద్ నిస్సార్

సైదాబాద్, మే 15: అత్యాధునిక క్యాన్సర్ సంరక్షణ సౌకర్యాలతో వైద్యాన్ని అభివృద్ధి చేసేందుకు బీబీ క్యాన్సర్ దవాఖానతో రెనోవా హాస్పిటల్స్ గ్రూప్ ఒప్పందం చేసుకున్నట్లు, తద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తామని రెనోవా యాజమాన్యం ప్రకటించింది. బుధవారం మలక్‌పేటలోని దవాఖానలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రెనోవా హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. తమ సంస్థ విస్తరణలో భాగంగా బీబీ ఆంకాలజీ సెంటర్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ 9వ కేంద్రంగా, ఐదో ఆంకాలజీ కేంద్రంగా మలక్‌పేటలో పని చేయబోతున్నామని చెప్పారు. ప్రజలకు ఆదర్శప్రాయమైన ఆరోగ్య సంరక్షణ సేవలందించడం వైపుగా తమ ప్రయాణంలో ముఖ్యమైన మైలురాయి అవుతుందన్నారు. అధిక నాణ్యత కలిగిన వైద్య సంరక్షణ ప్రాముఖ్యతను విస్తరించడానికి, ఉత్తమ సేవల ద్వారా రోగుల శ్రేయస్సును మెరుగుపర్చడానికి రెనోవా నిరంతరం కృషి చేస్తుందన్నారు. రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్‌లలో తాజా అత్యధిక సాంకేతికత అభివృద్ధి కోసం తాజాగా రూ.40కోట్లు పెట్టుబడి పెట్టనున్నామని, నేటి నుంచి రెనోవా బీబీ క్యాన్సర్ హాస్పిటల్‌గా వైద్య సేవలందించనున్నట్లు ఆయన తెలిపారు. బీబీ ఆంకాలజీ సెంటర్ చైర్మన్, ఎండీ డాక్టర్ సయ్యద్ నిస్సార్ మాట్లాడుతూ.. తమ దవాఖాన 1984లో స్థాపించామని, దేశంలోనే మొదటి ఆంకాలజీ హాస్పిటల్‌గా పేరు పొంది అనేక మందికి మెరుగైన వైద్య సేవలందించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కె.సయ్యద్ ఆక్రమ్, డాక్టర్ టి.విశాల్, రెనోవో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్, డాక్టర్ జనార్దన్, డాక్టర్ రవి, డాక్టర్ శంకర్ గౌడ్, డాక్టర్ రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒరుగు.. ఉపాధి మెరుగు

- ఉన్న ఊళ్లోనే కూలీలకు చేతినిండా పని
- మామిడికాయల ఒరుగుతో అదనపు ఆదాయం

చౌడాపూర్‌లో మామిడి ఒరుగు కోస్తున్న మహిళలు

కులకచర్ల, మే 15: బతుకుదెరువు కోసం కొందరు వలస మార్గాన్ని ఎంచుకుంటున్నారు. మరికొందరు స్థానికంగానే ఉంటూ ఇల్లు, సంసారాన్ని చూసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. కులకచర్ల మండల పరిధిలోని చౌడాపూర్, మందిపల్, కొత్తపల్లి, ముజాహిద్‌పూర్, కామునిపల్లి, పీరంపల్లి తదితర గ్రామాల్లో మహిళలు, కొంతమంది యువకులు మామిడి కాయల నుంచి ఒరుగు తీస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

కాలానుగుణంగా పంటలు తగ్గినా చింతపండు, మామిడి కాయల వ్యాపారం చేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాగే మామిడి కాయల వ్యాపారంతోపాటు ఆయా గ్రామాల్లో కొంత మంది మహిళలకు ఉపాధిని కూడా చూపిస్తున్నారు. ప్రతి ఏడాది కొంత మంది వ్యాపారులు మామిడి తోటలను లీజుకు తీసుకొని మామిడి కాయల నుంచి ఒరుగు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.

క్వింటాల్ ఒరుగుకు రూ.20వేలకు పైగానే..

మామిడి ఒరుగుకు మార్కెట్‌లో క్వింటాలు సుమారు రూ.20వేల నుంచి రూ.25వేలకు పైబడి ధర పలుకుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మామిడి కాయలు అంతంతమాత్రంగానే కాయడంతో మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. కొన్ని చోట్ల మామిడి చెట్ల నుంచి కాయలను తీసుకొచ్చి మామిడి ఒరుగు తయారు చేసి హైదరాబాద్ నగరంలో విక్రయిస్తున్నారు. మామిడి ఒరుగు తయారు చేసే సమయంలో కొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉదయం వేళల్లో ఉపాధిహామీ పనులకు వెళ్లి వచ్చిన తర్వాత ప్రత్యామ్నాయంగా మరో పని వెతుక్కోవాల్సిన పని లేకుండా ఆయా గ్రామాల్లో మామిడి కాయల నుంచి ఒరుగు తీయడానికి వెళ్లి రూ.200 నుంచి రూ.500 వరకు ఆర్జిస్తున్నారు. కూలీలకు కూడా ఇటు ఉపాధి హామీ పథకం ద్వారా అటు మామిడి ఒరుగు కూలీ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. ముఖ్యంగా మామిడి ఒరుగు తీసే సమయంలో మామిడి కాయలను తీసుకొచ్చి వాటిని శుభ్రంగా తోలు తీసి ఒరుగు తయారు చేస్తారు. తయారు చేసిన ఒరుగును శుభ్రమైన ప్రదేశాల్లో ఆరబెడతారు. ఆరబెట్టిన ఒరుగును సంచుల్లో నింపి మార్కెట్‌కు తరలిస్తారు. ఇంత వరకు మామిడి కాయల వ్యాపారులు తమ వ్యాపారాన్ని లాభసాటిగా కొనసాగిస్తున్నారు. అటు వ్యాపారంలో లాభంతో పాటు ఇటు కూలీలకు కూడా ఉపాధిని చూపిస్తున్నారు. మామిడి తోటలను లీజుకు తీసుకుని కాయలు కూడా హైదరాబాద్‌లోని మార్కెట్‌కు తరలించి లాభాలను ఆర్జిస్తున్నారు.

ఆరబెట్టిన మామిడి ఒరుగు

కూలీలకు ఉపాధి లభిస్తున్నది

మామిడి కాయల ఒరుగుతో కూలీలకు ఉపాధి లభిస్తున్నది. ఉదయం సమయంలో ఉపాధిహామీ పనులకు వెళ్లి మధ్యాహ్నం మామిడి కాయల ఒరుగు చేసే పనుల్లో కూలీలు బిజీగా ఉంటున్నారు. కాసిన మామిడి కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కష్టపడిన వారికి మంచి ఉపాధి. ఉపాధి చేసుకోవడానిక ఈ సీజనల్ వ్యాపారంలో మంచి ఆదాయాన్ని ఆర్జించవచ్చు. వేసవి కాలంలో పనులు లేని సమయంలో ఇది మంచి వ్యాపారం. తక్కువ కాలంలో ఎక్కువగా ఆదాయం పొందే వీలుంది. మామిడికాయల వ్యాపారులతో పాటు కూలీలకు కూడా మంచి ఉపాధి లభిస్తున్నది.

- మఠం రాజశేఖర్, మందిపల్

అదనపు ఆదాయం వస్తున్నది

వేసవి కాలంలో నీడపాటున కూర్చొని పనులు నిర్వహించేందుకు కూలీలు మామిడి ఒరుగు తీస్తున్నారు. ఉదయం ఉపాధి హామీ పనులు నిర్వహించి ఇంటికొచ్చిన తర్వాత మామిడి ఒరుగు తీసేందుకు వెళ్తున్నారు. దీని ద్వారా కూలీలకు అదనపు ఆదాయం వస్తున్నది. గతేడాది కంటే ఈసారి మామిడి కాయలు అంతంత మాత్రమే కాయడంతో మామిడి కాయలు, పండ్లతో పాటు, ఒరుగుకు కూడా మంచి డిమాండు ఉంది. సేకరించిన మామిడి కాయలను కోసి హైదరాబాద్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

- పి.అనంతయ్య, ముజాహిద్‌పూర్, కులకచర్ల

కళాశాలలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రత్నకల్యాణి

షాబాద్, మే 15 : రంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల ప్రవేశం కోసం కళాశాలలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రత్నకల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని 2024-25 సంవత్సరానికి రెప్యూటేడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/వెనుకబడిన తరగతులు/ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ/వికలాంగుల విద్యార్థినీ విద్యార్థుల ప్రవేశం కోసం కింది అర్హతలు, వసతులు కలిగిన కళాశాలలు (ఇంతకు ముందు రిజిస్ట్రేషన్ అయినవి, కొత్తవి) ఈ నెల 30 వరకు E pass WebSite Online లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాలల్లో అన్ని ప్రాథమిక వసతులు, సౌకర్యాలు కలిగిన అనుబంధ వసతి గృహం ఉండాలన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు ఉన్న ప్రయోగశాలలు, తరగతి గదులు, డార్మిటరీ, విశాలమైన ఆటస్థలం కలిగి ఉండాలన్నారు. కళాశాల భవనంలో పూర్తిస్థాయి అగ్ని మాపక సౌకర్యం కలిగి ఉండాలని చెప్పారు. కళాశాలలో గత మూడేండ్ల నుంచి వరుసగా 90 శాతం పైగా ఉత్తీర్ణత కలిగి ఉండి, కనీసం 50 శాతం మొదటి శ్రేణిలో, డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. కళాశాలలో ఐఐటీ/ఐఈఈ/ఏఐఈఈఈ/ఎం.సెట్ అర్హత పరీక్షల్లో ఉన్నత స్థాయి ఉత్తీర్ణత శాతం కలిగి ఉండాలన్నారు. కళాశాలలో అనుభవం కలిగిన బోధనా సిబ్బంది, మంచి స్థాయిలో పూర్తి వసతి కలిగిన లైబ్రరీ, ప్రయోగశాలలు ఉండాలని చెప్పారు. పై అర్హతలు ఉన్న జూనియర్ కళాశాలలు E pass WebSite Online లో తమ తమ కళాశాలలను ఈ నెల 30 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్ కోసం..

రంగారెడ్డి జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్టీ గిరిజన ఉప కులాల అభ్యర్థుల నుంచి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్ ద్వారా మాస్టర్స్ (Ph.D and Post-Doctoral Research Programmes)అభ్యసించడానికి ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు రంగారెడ్డిజిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఆర్.రత్నకల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 31లోగా ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ కోసం కేవలం 20మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎస్టీ గిరిజన ఉప కులాల అభ్యర్థులు వెబ్‌సైట్ <https://overseas.tribal.go.in> ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఇతర సమాచారం కోసం మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్స్ <https://overseas.tribal.go.in> వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

కాచిగూడ, మే 15: పీఆర్‌సీ రిపోర్టులో తెలిపిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో రిటైర్డ్‌మెంట్‌తో ఏర్పడిన 25వేల ఖాళీ టీచర్ పోస్టులను రాష్ట్ర ప్రభు త్వం వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం టీచర్ పోస్టుల సంఖ్యను పెంచితే బీఈడీ, డీఈడీ విద్యనభ్యసించిన వందలాది మందికి అర్హత లభిస్తుందన్నారు. గత 25 ఏండ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో 90 శాతం ఖాళీగా ఉన్న టీచర్, పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో భూపేశ్‌సాగర్, నందగోపాల్, ఉదయ్ నేత, సుధాకర్, రామకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30లోపు దరఖాస్తు చేసుకోవాలి

- కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి మల్లేశం

వికారాబాద్, మే 15 : కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి మల్లేశం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం ఈ నెల 15 నుంచి 30లోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు https://telanganaepass.cgg.gov.in అనే వెబ్ సైట్ ద్వారా సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం మార్చి 2024లో పదో తరగతిలో ఉత్తీర్ణులై జీపీఏ 7.0 ఆపైన సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాల, ఎయిడెడ్ పాఠశాల, బెస్ట్ అవైలేబుల్ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, గురుకులాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను తక్షణమే నమోదు చేసుకోవాలని తెలిపారు.

స్నేహరాంచందర్‌కు 'మహాబలి' పురస్కారం

నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి స్నేహ రాంచందర్‌కు సాంస్కృతిక, సేవా రంగాలకు చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక 'మహాబలి' పురస్కారం లభించింది. ఇండోనేషియాలోని బాలి విశ్వవిద్యాలయంలో సంగమం గ్లోబల్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిసెర్చ్(ఐసీసీఆర్), బాలి విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన నృత్యోత్సవంలో స్నేహరాంచందర్ ఈ పురస్కారాన్ని బాలి నగరానికి చెందిన రాజు డాక్టర్ అరివేదకర్ణ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థల ప్రతినిధులు నవీన్ మేఘవిల్, డాక్టర్ ఎన్.పంచనాథమ తదితరులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి, మే 15

నైజీరియాకు ఇక్రిశాట్ సాయం

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ): నైజీరియా వ్యవసాయ రంగానికి ఇక్రిశాట్ టెక్నాలజీ సాయం అందించనున్నది. నైజీరియాలోని కానో ప్రాంతంలోని 3వేల మంది రైతులు, విత్తనోత్పత్తి సంస్థలకు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలు, విత్తనోత్పత్తి, నూతన వంగడాలతో పాటు చీడల నియంత్రణ తదితర అంశాల్లో మెళకువలను ఇక్రిశాట్ పరిశోధకులు అందించనున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార పంటల ఉత్పత్తి, సుస్థిర వ్యవసాయ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఇక్రిశాట్ కృషి చేస్తున్నది. ఈ క్రమంలో ఆఫ్రికాలోని పలు దేశాలకు అవసరమైన సాగు విధానాలపై అవగాహన కల్పిస్తుండగా, తాజాగా నైజీరియాలోనూ కానో రైతులు ఇక్రిశాట్‌తో ఒప్పందం చేసుకున్నారు. దీని ద్వారా వచ్చే దశాబ్ద కాలంపాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన సేవలు అందించనున్నది. ఈ ఒప్పందం ద్వారా స్థానికంగా ఆహార పంటల ఉత్పత్తి పెరుగుతుందని ఇక్రిశాట్ పరిశోధకులు చెబుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

వికారాబాద్, మే 15 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రూ.1000 ఆలస్య రుసుంతో ఈ నెల 16 వరకు సంబంధిత కళాశాలలో చెల్లించాలని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి ఎన్.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి తల్లి దండ్రులు, కళాశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఎస్టీపీ పనులు వేగిరం చేయండి

అధికారులను ఆదేశించిన ఎండీ సుదర్శన్ రెడ్డి

ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ): జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి బుధవారం ఎస్టీపీ పనుల పురోగతిని పరిశీలించారు. అత్తాపూర్, మిరాలంలో నిర్మిస్తున్న ఎస్టీపీలతోపాటు హసన్‌నగర్‌లో ఉన్న ఐఅండ్‌డీలను ఆయన సందర్శించారు. ముందుగా అత్తాపూర్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన నిర్మాణ పనులు పరిశీలించి వేగంగా చేయాలని ఆదేశించారు. అనివార్య కారణాలతో పనులు ఆలస్యమైనప్పటికీ సకాలంలో పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం ఇటీవల పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మిరాలం ఎస్టీపీని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సమీప కాలనీల నుంచి చెరువులోకి మురుగు చేరే పాయింట్లను గుర్తించారు. ఈ మురుగు చెరువులో చేరకుండా, చెరువు చుట్టూ ఉన్న పైపులైన్లను అనుసంధానం చేసి కొత్తగా నిర్మిస్తున్న ఎస్టీపీలోకి మళ్లించాలని ఆదేశించారు. ఈ మళ్లింపు పనులకు జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. పని జరిగే ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని ఎండీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్, సీజీఎం సుదర్శన్, జీఎం, ఎస్టీపీల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

యునెస్కో గ్రీనింగ్ ఎడ్యుకేషన్ పార్టనర్‌షిప్‌లోకి మహీంద్రా

దుండిగల్, మే 15 : గ్రీనింగ్ ఎడ్యుకేషన్ పార్టనర్‌షిప్‌లో భాగం కావడానికి ఐక్యరాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ(యునెస్కో)తో మహీంద్ర విశ్వవిద్యాలయం భాగస్వామ్యాన్ని పొందినట్లు యూనివర్సిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా వ్యవస్థలు, పాఠ్యాంశాల్లో వాతావరణ మార్పులను ఏకీకృతం చేయడం ద్వారా భాగస్వామ్యం సమగ్ర విధానాన్ని తీసుకుంటుందన్నారు. వాతావరణ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన విజ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులతో అభ్యాసకులను సన్నద్ధం చేసే ప్రయత్నంలో గ్రీనింగ్ ఎడ్యుకేషన్ పార్టనర్‌షిప్ ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులతో ఎదురయ్యే సవాళ్లను తగ్గించడానికి అవసరమైన సాధనాలతో అన్ని వయసుల అభ్యాసకులను సన్నద్ధం చేయడమే దీని ముఖ్య లక్ష్యమన్నారు. వినూత్న విద్య కార్యక్రమాలు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ద్వారా వాతావరణ మార్పుపై పోరాటంలో తాము గణనీయమైన ప్రభావాన్ని చూపగలమని మహీంద్రా విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ సస్టైనబిలిటీ హెడ్ అనిర్బన్ ఘోష్ అన్నారు.

నేల చల్లబడ్డాకే సాగు చేయండి

- తొలకరి చినుకుకే విత్తనాలు నాటి నష్టపోవద్దు
- రెండుమూడు వర్షాలు పడే వరకు ఆగండి
- రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, మే15: రెండు మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాకే సాగుకు ఉపక్రమించాలని, తొలకరి చినుకులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకులు(ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమకు సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహా తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల్య వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విలువైన సూచనలు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమని తెలిపారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుక్కునేటప్పుడు అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న డీలర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పనిసరిగా రసీదు పొంది పంట చివరి వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. మూస పద్ధతిన సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు ప్రేమ్‌సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకులు డా. అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఉద్యాన పంటలు కూరగాయలు, పూల తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కాలుష్య కారకాలతో అధిక ఉష్ణోగ్రతలు

- వాతావరణంలో వేడిని పెంచుతున్న గాలిలోని రసాయనాలు
- 3 నుంచి 10 శాతం మేర ఉష్ణోగ్రతలు పెరుగుతాయంటున్న పరిశోధకులు

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ) : వాతావరణంలో చేరుతున్న రసాయనాల ద్వారా కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లుగా వెల్లడైంది. హైదరాబాద్ నగర వాతావరణంలో పరిమితికి మించి చేరుతున్న కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, ఓజోన్, ఫార్మాల్డిహైడ్, సల్ఫర్ వంటి రసాయనాల కారణంగా ఏటా 3-10శాతం మేర ఉష్ణోగ్రతలు మార్పులకు లోనవుతుందని, దీంతో ఏటా 1-2 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదు అవుతున్నట్లుగా తేల్చారు. ఇందులో ప్రధాన నగరాల్లో ఆసిఫ్‌నగర్, చార్మినార్, గోల్కొండ, నాంపల్లి, బహదూర్‌పురా, అంబర్‌పేట, ఉప్పల్, సరూర్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లుగా తేల్చారు. ఎన్ఐటీ తిరుచ్చి చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

పట్టణీకరణ ఆధారంగా వాతావరణ మార్పులను అధ్యయనం చేసిన ఆ సంస్థ... అధిక ఉష్ణోగ్రతలకు వాతావరణంలో చేరుతున్న కాలుష్య కారకాలు కూడా దోహదపడుతున్నాయని, దీంతోనే ఎక్కువ వేడి ప్రభావితం అవుతున్నట్లుగా తేల్చారు. హైదరాబాద్ నగరంలో మెజార్టీ ప్రాంతాల్లో కార్బన్ ఉద్గారాల పరిమాణం పరిమితికి మించి చేరుతుందని, కరోనా తర్వాత పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే ఎక్కువగా వ్యక్తిగత వాహనాల వినియోగంతో గణనీయంగా వాహనాల సంఖ్య వృద్ధి చెందుతున్నట్లుగా తేల్చారు. ఈ ప్రభావం అవుటర్ రింగు రోడ్డు వరకు విస్తరించి ఉన్నట్లుగా పేర్కొన్నారు. అదే సమయంలో అవుటర్ రింగు రోడ్డు మీద కూడా వాహన రాకపోకలు విపరీతంగా పెరగడంతో.. గాలిలో వాతావరణ కాలుష్యం తీవ్రత వలన ఉష్ణోగ్రతలు మారుతున్నట్లుగా వివరించారు.

హెల్త్ కేర్ ఆవిష్కరణలకు సీడీఎఫ్డీ వేదిక

- సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్‌లో పెరుగుతున్న హెల్త్‌కేర్ స్టార్టప్‌లు
- వైద్య రంగానికి అవసరమైన ఆవిష్కరణలకు ప్రోత్సాహం.

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ): డీఎన్ఏ పరిశోధనల్లో కీలకపాత్ర పోషిస్తున్న సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సంస్థ ఇప్పుడు ఆవిష్కరణలకు వేదికగా మారుతున్నది. ఎన్నో అంతు చిక్కని, తరతరాలుగా పట్టి పీడిస్తున్న వ్యాధులకు పరిష్కారం కనుగొనే కేంద్రంగా నిలుస్తోంది. వినూత్న ఆవిష్కరణలతో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వైద్య విధానాలతో హెల్త్ హబ్‌గా నిలిచిన హైదరాబాద్..కరోనా తర్వాత వినూత్న ఆవిష్కరణలతో హెల్త్‌కేర్ స్టార్టప్‌లకు ప్రధాన కేంద్రంగా రూపాంతరం చెందుతున్నది. ఈ క్రమంలో అంతు చిక్కని ఎన్నో వ్యాధులకు పరిష్కారాలను అందించేలా సీడీఎఫ్‌డీ ఇంక్యుబేటర్ ప్రత్యేక పాత్రను పోషిస్తున్నది.

స్టార్టప్ ఎకో సిస్టంతో, వినూత్నమైన ఆలోచనలకు కార్యరూపాన్ని తీసుకురావడంలో సీడీఎఫ్‌డీ- ఇంక్యుబేటర్ స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ సౌకర్యాలను అందిస్తున్నది. ఔత్సాహికవేత్తలకు అవసరమైన మార్గదర్శకాలతో పాటు ఫండింగ్, నెట్‌వర్కింగ్ సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నది. ఇటీవల కాలంలో హెల్త్ కేర్ రంగంలో స్టార